సాక్షి ప్రకాశం
ఆదివారం । 2 । జూన్ । 2024



అంజనీపుత్రా..నమోస్తుతే

హనుమజ్జయంతి సందర్భంగా శనివారం జిల్లా వ్యాప్తంగా ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలతో పూజలు నిర్వహించారు. - 8లో..



సత్తాచాటిన గుంటూరు కోడెలు

రాచర్ల మండలంలోని వేమయ్యస్వామి ఆరాధన మహోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి ఎడ్లబండలాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. - 8లో..

గరిష్టం/కనిష్టం
40/31

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. ఒకటి రెండు చోట్ల జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

చిన్న పిల్లలతో పనిచేయిస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్



జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు సిటీ: దుకాణాలు, వాణిజ్య సంస్థలు, హోటల్, సినిమా థియేటర్, మెకానిక్ షాప్స్, వెల్డింగ్ షాప్స్, ఇటుక బట్టీలు, పొగాకు గ్రేడింగ్ పాయింట్, గ్రానైట్ పాలిషింగ్ యూనిట్లు, హేచరీస్‌లలో చిన్న పిల్లలతో పనిచేయిస్తే చట్టారీత్యా కఠిన చర్యలు తీసుకొంటామని కలెక్టర్ ఏ.ఎస్.దినేష్‌కుమార్ తెలిపారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు జూన్ 1 నుంచి 30 వ తేదీ వరకు జరిగే ప్రత్యేక తనిఖీల కార్యక్రమాన్ని జెండా ఊపి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలకార్మికులు ఎక్కడైనా పనిచేసినట్లు చూసిన వారు ఎవరైనా పోలీస్ 100 కు గానీ, చైల్డ్ లైన్ నంబరుకు గానీ సమాచారం ఇవ్వవచ్చని తెలిపారు. కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ సమితి సభ్యురాలు బి.పద్మావతి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టరు మాధురి, సహాయ కార్మిక కమిషనర్లు ఎం.కోటేశ్వరరావు, కె.పవన్‌కుమార్, బి.అనితావాణి, ఏహెచ్‌టీయూ సిబ్బంది రాజ్యలక్ష్మి, డీసీపీఓ దినేష్‌కుమార్, సహాయ కార్మిక అధికారులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన 1896 సర్వీస్ ఓట్లు



సర్వీస్ ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద స్పెషల్ ఆఫీసర్ ఝాన్సీ

ఒంగోలు: సర్వీస్ ఓట్లు శనివారం నాటికి జిల్లాకు 1896 చేరుకున్నాయి. జిల్లా పోస్టల్ ఓటింగ్ పార్లమెంట్ స్పెషల్ ఆఫీసర్ కె.ఝాన్సీలక్ష్మి తన చాంబర్‌లో రాజకీయ ప్రతినిధుల సమక్షంలో ఒంగోలు పార్లమెంట్‌కు సంబంధించి వచ్చిన 25 సర్వీస్ ఓట్లను రాజకీయ ప్రతినిధులకు చూపించి పోస్టల్ బ్యాలెట్ బాక్సులో వేశారు. మొత్తం 6693 ఓట్లకుగాను శనివారం నాటికి 1896 వచ్చాయి. ఈ ప్రక్రియ ఈనెల 4వ తేదీ ఉదయం 8 గంటల వరకు వచ్చిన వాటిని లెక్కలోకి తీసుకుంటారు. శనివారం ఈ లెక్కింపు కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నుంచి దామరాజు క్రాంతికుమార్, కాంగ్రెస్ నుంచి రసూల్, బీజేపీ నుంచి రాజశేఖర్, కొమ్ము యోహాను, సీహెచ్ ఏడుకొండలు, రమణారెడ్డి, కొండారెడ్డి, పిరమిడ్ పార్టీ నుంచి సూర్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు

ఒంగోలు: ఏపీ ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పదో తరగతికి సంబంధించి తెలుగు పరీక్షకు 387 మందికిగాను 319 మంది, హిందీ పరీక్షకు ఆరుగురికి గాను ఐదుగురు హాజరయ్యారు. మొత్తంగా 393 మందికి 324 మంది హాజరయ్యారు. ఇంటర్ పరీక్షలకు సంబంధించి హిందీ 8 మందికి గాను ఏడుగురు, తెలుగు 640 మందికి 546 మంది, ఉర్దూ ఇద్దరికిగాను ఇద్దరూ హాజరయ్యారు. మొత్తంగా 650 మందికి 555 మంది హాజరయ్యారని ఏపీ ఓపెన్ స్కూల్ జిల్లా చైర్మన్, కోఆర్డినేటర్‌లు డి.సుభద్ర, బి.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

77.45 శాతం పింఛన్ల పంపిణీ

ఒంగోలు టౌన్: సామాజిక పింఛన్ల పంపిణీ తొలిరోజు 77.45 శాతం మందికి ఇంటి వద్దనే పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 2.91 లక్షల మంది పింఛన్‌దారులు ఉండగా, వారిలో 73,150 మందికి సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేయనున్నారు. అందులో 56,656 మందికి శనివారం పింఛన్లు పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ వసుంధర తెలిపారు. మొత్తం రూ.21.66 కోట్లకు గాను రూ.16.83 కోట్లకు పైగా పంపిణీ చేసినట్లు వివరించారు.

అలాగే డీబీటీ ద్వారా 2,18,818 మందికి గాను రూ.65,64,6400 ప్రభుత్వం బ్యాంకులకు జమ చేసినట్లు తెలిపారు. ఈ నెల 5వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ కొనసాగుతుందని ఆమె తెలిపారు.

చేనుకు చేవ.. రైతుకు రొక్కం

భూసారం బాగుంటే నాణ్యమైన పంట.. అధిక దిగుబడులు సాధ్యమవుతాయి. రైతు భూమిలో సారం ఏమాత్రం ఉందో పరీక్షించుకుని భూమిలో లోపించిన పోషక విలువలను సమతుల్యత చేసుకునేందుకు భూసార పరీక్షలు ఉపయోగపడుతున్నాయి. భూముల నుంచి సేకరించిన మట్టి శాంపిళ్లలో 12 రకాల పరీక్షలు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 10 వేల నమూనాలు సేకరించి రైతులకు వారి భూముల్లో సారాన్ని తెలియజేస్తున్నారు.

- మట్టి పరీక్షలతో పంటలకు భూసారం
- జిల్లా వ్యాప్తంగా 10 వేల మట్టి నమూనాల సేకరణ
- భూమి సమతుల్యత సాధించడమే ప్రభుత్వ లక్ష్యం



సేకరించిన మట్టిని పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

ఒంగోలు సెంట్రల్: భూసార పరీక్షలతో భూమిలో పోషక విలువల సమతుల్యత సాధించవచ్చు. ఈ దిశగా రైతులకు మేలు చేసేందుకు భూసార పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లా మొత్తం 10 వేల మట్టి నమూనాలు సేకరించారు. వీటిని జిల్లా కేంద్రంలోని సాయిల్ టెస్ట్ కేంద్రంలో భూసార పరీక్ష కేంద్రం ద్వారా సారం కోల్పోయిన భూమిలో పోషక విలువల సమతుల్యత సాధించటమే ప్రభుత్వ లక్ష్యం. తద్వారా పంటల సాగులో అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంది.

ఏడాదికి, మూడేళ్లకొకసారి...

నీటి సౌకర్యం అనగా బోర్లు, బావులు, సాగునీటి కాలువల ద్వారా ఏడాది పొడవునా నీటి సౌకర్యం ఉన్న పొలాల్లో ఏడాదికొకసారి తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలి. ప్రతి మూడు సీజన్‌లకొకసారి భూసార పరీక్షలు చేయించుకోవటం వల్ల రైతుకు మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. వర్షాధార పంటలు సాగు భూముల్లో అనగా కేవలం ఏడాది పొడవునా కురిసే వర్షాలపై ఆధారపడి పంటలు సాగుచేసే మెట్ట భూముల్లో మూడేళ్లకొకసారి భూసార పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. రైతులు పంటలు సాగు చేసిన ప్రతిసారి భూమిలో నత్రజని, భాస్వరం వినియోగం ఎక్కువగా ఉంటుంది. భూసార పరీక్షలో భూమిలో ఎంత మేరకు నీటి శాతం తగ్గిందో తెలుసుకోవచ్చు. తద్వారా పంట సాగు చేసే ముందు పొలంలో తగినంత మేరకు నీటిని పిచికారి చేస్తే భూసారం మళ్లీ యథాస్థితికి చేరుకుని మంచి పంట దిగుబడులు సాధించవచ్చు. భూసార పరీక్షలు చేయించుకోవటం వలన పొలం గుల్లబారి పోకుండా జాగ్రత్త పడవచ్చు.

ఖరీఫ్, రబీ సీజన్ ప్రారంభాలు అనుకూలం:

జిల్లా వ్యాప్తంగా సాధారణంగా ఖరీఫ్‌లో 1,50,082 హెక్టార్లు, రబీలో 1,23,014 హెక్టార్లు రబీలో సాగవుతుంది. భూసార పరీక్షల కోసం పొలాల్లో గానీ, భూమిలో గానీ మట్టి నమూనాలు సేకరించేందుకు ఖరీఫ్, రబీ సీజన్ ప్రారంభ సమయాలు చాలా వరకు పొలాల్లో అధికంగా ఉంటాయి. ఏడాదిలో ఈ రెండు సీజన్‌ల ప్రారంభ సమయాల్లో చాలా వరకు పొలాల్లో పంటల సాగు ఉండదు. దీంతో బీడు భూములు అధికంగా ఉంటాయి. అప్పుడు మట్టి నమూనాలు సేకరిస్తే కచ్చితమైన ఫలితాలు వస్తాయనేది వ్యవసాయాధికారుల నమ్మకం. బీడు భూములపై ఉన్న పిచ్చి మొక్కలను, గడ్డిని తొలగించి అక్కడ మట్టి నమూనాలు సేకరిస్తారు.

ఎనిమిది చోట్ల మట్టి సేకరణ...

భూసార పరీక్షల్లో భాగంగా ఒక పొలంలో ఎనిమిది చోట్ల మట్టి నమూనాలు సేకరిస్తారు. అవి వర్షాధార భూములైనా సరే...నీటి సౌకర్యం ఉన్న భూములు పొలాలైనా సరే మట్టి సేకరణ విధానం ఒకేలా ఉంటుంది. పొలం నలుమూలలు ఎనిమిది చోట్ల ''వీ'' ఆకారంలో తవ్వి ఒక చోట అర కిలో చొప్పున మట్టి నమూనా సేకరిస్తారు. మట్టి నమూనాను తీయాల్సిన చోట చెత్తా చెదారం లేకుండా చూడాలి. తర్వాత మట్టి మొత్తాన్ని శుభ్రమైన సంచి లేదంటే గోనె సంచి పైన పోసి కలపాలి. కలిపిన చోట రాళ్లు, పంట వేళ్లు, కొయ్యలు తీసి వెయ్యాలి. మట్టి తడిగా ఉంటే నీడలో ఆరబెట్టాలి. కలిపిన మట్టిని నాలుగు భాగాలుగా విడదీయాలి. ఎదురెదురుగా రెండు భాగాలు ఉంచి మిగతా రెండు భాగాలను తీసి వేయాలి. ఈ మట్టిని శుభ్రమైన సంచిలో గానీ, పాలిథిన్ సంచిలో గానీ నింపాలి. ఈ ప్యాకెట్ లోపల నమూనా వివరాలు ఉన్న పత్రం ఉంచాలి. సమాచార పత్రంలో రైతు పూర్తి పేరు, తండ్రి పేరు, చిరునామా, పొలం పేరు, సర్వే నంబరు, ఎంత భూమి, మెట్ట లేదా నీటిపారుదల లేదా ఆరుతడి, మూడేళ్లుగా వేసిన పైరుకి వాడిన ఎరువులు, పంట దిగుబడి వివరాలు, సాగు చేసే పంట వివరాలను నమోదు చేయాలి. సేకరించిన మట్టిని ఏవో ద్వారా భూసార పరీక్ష కేంద్రానికి పంపితే భూసార పరీక్షలు చేస్తారు. తద్వారా పొలంలో పోషకాలు ఎంత మేరకు ఉన్నాయో తెలిసే అవకాశం ఉంటుంది.



జిల్లా భూ పరీక్షల కేంద్రంలో మండలాల వారీగా సేకరించిన మట్టి నమూనాలు

భూసార పరీక్ష కేంద్రాలు

జిల్లాలో ఉన్న భూసార పరీక్ష కేంద్రంతో పాటు నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసుకున్న ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్స్, ఏఎంసీ ఎల్‌టీఎల్, మార్కాపురం, ఎంఎస్‌టీఎల్ గిద్దలూరులలో ఉన్నాయి.

12 రకాల పరీక్షలు:

రైతుల పొలాల్లో సేకరించిన మట్టి నమూనాలకు 12 రకాల పరీక్షలు చేయనున్నారు. అవి ఉదజని సూచిక (పీహెచ్), లవణ సూచిక (ఈసీ), సేంద్రియ కర్బనం (ఓసీ) స్థూల పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాషియం, సల్ఫర్ (గంధకం) లభ్యత, సూక్ష్మపోషకాలైన జింక్, కాపర్, బోరాన్ లభ్యత పరీక్షలు చేస్తారు. ఇవన్నీ సమతుల్యంగా ఉంటేనే పంటలు అధిక దిగుబడులు ఇస్తాయి.

జిల్లా వ్యాప్తంగా పదివేల నమూనాల సేకరణ:

2023–24 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో పదివేల మట్టి నమూనాల సేకరణ లక్ష్యంగా పెట్టుకుని జిల్లాలోని 616 రైతు భరోసా కేంద్రాల ద్వారా సేకరించి జిల్లా భూసార పరీక్ష కేంద్రానికి పంపారు. భూసార పరీక్ష ఫలితాలను విశ్లేషించి అక్కడ ఎస్‌హెచ్‌సీ మొబైల్ యాప్ (సాయిల్ హెల్త్ కార్డ్ మొబైల్ యాప్)లో నమోదు చేస్తారు. ఆయా కేంద్రాల్లో ఎస్‌హెచ్‌సీ మొబైల్ యాప్ ట్రాక్ సాంపిల్ అనే ఆప్షన్ ద్వారా భూసార పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇప్పటి వరకు 6 వేల ఫలితాలు వెల్లడించారు.

స్థూల, సూక్ష్మ పోషకాల సమతుల్యత..

పంటలు సాగు చేసే పొలాల్లో, చేలల్లో స్థూల, సూక్ష్మ పోషకాల సమతుల్యత భూసార పరీక్ష ద్వారా సరిచూసుకోవాల్సి ఉంటుంది. పొలాల్లో దుక్కులు చేసి విత్తనాలు వేసే సమయంలో సూక్ష్మ పోషకాలను వినియోగించాల్సి ఉంటుంది.



మట్టిలో పీహెచ్ విలువలు పరీక్షిస్తున్న ఏడీఏ, అధికారులు

బోరాన్, సల్ఫర్:

పంట సాగులో బోరాన్, సల్ఫర్‌ను తప్పనిసరిగా వినియోగించాలి. తద్వారా కాయలు నాణ్యతగా వస్తాయి. వాటి బరువు కూడా పెరుగుతుంది.

జింక్..

జింక్ వినియోగించటం వల్ల మొక్కల్లో కాండం, మొక్క ఎదుగుదల ఎక్కువగా, దృఢంగా ఉంటాయి. అంతే కాకుండా కాయల్లో గింజ ఏర్పడే శాతం కూడా పెరుగుతుంది.

జిప్సం:

పొలాల్లో జిప్సం చల్లటం వలన గింజల్లో నూనె శాతం ఎక్కువగా ఏర్పడుతుంది. పంట పొలాల్లో దుక్కులు చేసే సమయంలో ఎకరానికి 200 కేజీల జిప్సం చల్లాలి.

రెండు రెట్లు అధికం:

భూసార పరీక్షలు నిర్వహించి ఫలితాలు తెలుసుకోవటం వలన సాగులో మంచి ఫలితాలు సాధించుకోవటం వలన సాగులో మంచి ఫలితాలు సాధించవచ్చు. పొలంలో ఉన్న భూసార లోపాలు తెలుసుకుని వ్యవసాయాధికారులు సూచనలు, సలహాల మేరకు సదరు పొలంలో సాగు చేసే పంటలు దిగుబడి కన్నా రెండు రెట్లు అధికంగా సాధించే అవకాశం ఉంటుంది.

సారవంతంగా మార్చుకోవచ్చు



భూసార పరీక్షలతో పొలాలను భూములు సారవంతంగా మార్చుకోవచ్చు. భూసార ఫలితాల కార్డులను రైతులకు యాప్ ద్వారా ఎప్పటికప్పుడు పంపిస్తున్నాం. జిల్లాలో 10 వేల నమూనాలు సేకరిస్తే ఇప్పటి వరకు 6 వేల వరకు సంబంధిత యాప్‌కు పంపాం. ఆయా ఫలితాలను బట్టి అవసరమైన ఎరువులు వాడుకుని సారవంతంగా మార్చుకుని అధిక దిగుబడులు పొందవచ్చు.

– సుచరిత, ఎస్‌టీఎల్, ఏడీఏ, ఒంగోలు.

కుమారుడిని కాల్చి చంపిన కానిస్టేబుల్

- రూ.20 వేల నగదు విషయంలో ఇద్దరి మధ్య వివాదం
- క్షణికావేశంలో సర్వీస్ రివాల్వర్‌తో కాల్చివేత



శేష్ కమల్ మృతదేహం

ఒంగోలు టౌన్: క్షణికావేశంలో కన్నబిడ్డనే కాల్చిచంపాడు ఒక పోలీసు కానిస్టేబుల్. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఒంగోలు నగరంలోని గుంటూరు రోడ్డులో వి గ్రాండ్ ఎదురుగా నివశించే 1998 బ్యాచ్‌కు చెందిన ఏపీఎస్పీ కానిస్టేబుల్ కొదముల ప్రసాద్ భాగ్య నగర్‌లోని ఈవీఎం గోడౌన్ వద్ద సెక్యూరిటీ విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి ఆయన కుమారుడు శేష్ కమల్ (20) తండ్రిని డ్యూటీ దగ్గర వదిలేందుకు మోటారు బైకు మీద తీసుకెళ్లాడు. నెల మొదటి తేదీ కావడంతో జీతాలు వచ్చి ఉన్నాయి. ప్రసాద్ బ్యాంకు నుంచి రూ.20 వేలు డ్రా చేశాడు. దాంతో డ్యూటీకి వదిలిన తరువాత కుమారుడు కమల్ రూ.20 వేలు ఇవ్వాలని అడిగాడు. దాంతో ఇద్దరి మధ్య వాదన జరిగింది. క్షణికావేశానికి లోనైన ప్రసాద్ లోపలికి వెళ్లి సర్వీస్ తుపాకి తీసుకొని వచ్చి కుమారుడిని కాల్చాడు. కుడి భుజం కింద తగిలిన బుల్లెట్ ఎడమ భుజం నుంచి బయట పడింది. తీవ్ర గాయాల పాలైన కమల్ అక్కడికక్కడే మృతి చెందాడు. కమల్ డిగ్రీ వరకు చదివాడు. పోలీసు కావాలని కలలుగన్నాడు. అయితే పోలీసైన తండ్రి చేతిలోనే మరణించాడు. ప్రసాద్‌కు ముగ్గురు సంతానం కాగా ఒక అబ్బాయి, ఇద్దరు అమ్మాయిలకు వివాహమైంది. ఈ ఘటన ఒంగోలులో సంచలనం సృష్టించింది. కానిస్టేబుల్ ప్రసాద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డీఎస్పీ కిషోర్‌బాబు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొగాకు ధర రికార్డుల మోత

కొండపి (సింగరాయకొండ): పొగాకు వేలం ధరలు నానాటికీ రికార్డులు తిరగరాస్తున్నాయి. కొండపిలోని స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో పొగాకు అత్యధిక ధర కిలో రూ.350 పలికిందని, కొండపి బోర్డు చరిత్రలోనే ఇది రికార్డు ధర అని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. వ్యాపారులు జువ్విగుంట, అయ్యవారిపాలెం, జాళ్లపాలెం, పీరాపురం గ్రామాలకు చెందిన రైతులు 1215 బేళ్లు తీసుకొనిరాగా 1137 బేళ్లు కొనుగోలయ్యాయి. గరిష్ట ధర రూ.350, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.279.36, వేలంలో 20 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

జై భజరంగి



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి విగ్రహం

- భక్తి శ్రద్ధలతో హనుమాన్ శోభాయాత్ర
- జై శ్రీరామ్..జై హనుమాన్ నినాదాలతో మార్మోగిన మార్కాపురం
- భారీ సంఖ్యలో పాల్గొన్న భక్తులు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో హనుమత్ జయంతి సందర్భంగా శనివారం హిందూ ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అన్నీ జాగ్రత్తలు తీసుకుంటూ తర్లుపాడు రోడ్డులోని ఆంజనేయస్వామి గుడి వద్ద నుంచి కోర్టు సెంటరు, కంభం సెంటరు, పాత బస్టాండు, దోర్నాల బస్టాండు, నాయుడు బజారు, తేరు బజారు, అమ్మవారిశాల, మెయిన్ బజారు మీదుగా చెన్నకేశవస్వామి గుడి వరకూ ర్యాలీ సాగింది. హనుమాన్ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. జై శ్రీరామ్... జై హనుమాన్ నినాదాలతో హనుమాన్ శోభాయాత్ర జరిగింది. శోభాయాత్రకు ముందు కోఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి ఆధ్వర్యంలో మహిళా బృందం కోలాటం, కర్రసాము వంటి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ర్యాలీలో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త గోపాలుని హరిహరరావు, శిరసనగండ్ల శ్రీనివాసులు, బీసీ జాతీయ సంఘ ప్రధాన కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్, దేవిశెట్టి చంద్రశేఖర్, భజరంగ్‌దళ్ ప్రముఖ్ కాళంరాజు రామకృష్ణ, ఇమ్మడిశెట్టి వీరారావు, కంభంపాటి వెంకట రమణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పానుగంటి మురళి, శోభాయాత్ర కమిటీ సభ్యులు పీవీ కృష్ణారావు, బీవీరెడ్డి, వాసవీ విద్యా సంస్థల అధినేత కే రంగయ్య, అంజిరెడ్డిలతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు. పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



ర్యాలీలో పాల్గొన్న భక్తులు



కర్రసాము విన్యాసం చేస్తున్న చిన్నారులు



గిద్దలూరు: ప్రత్యేక అలంకరణలో పంచముఖ ఆంజనేయస్వామివారు



లక్ష తమలపాకుల అర్చనలో ద్వారకానగర్ వీరాంజనేయస్వామి



హనుమజ్జయంతి సందర్భంగా సంతపేట వీరాంజనేయస్వామికి అభిషేకాలు





తమలపాకులు, అరటిపండ్లతో ప్రత్యేక అర్చనలో కేశవస్వామిపేట వీరాంజనేయస్వామి

అంజనీ పుత్రా నమోస్తుతే!

వైశాఖ మాసం బహుళపక్ష దశమి పురస్కరించుకొని శనివారం అంజనీ పుత్రుడు ఆంజనేయ స్వామి జయంతి మహోత్సవాలు జిల్లా వ్యాప్తంగా వైభవంగా నిర్వహించారు. వారం రోజుల నుంచి హనుమత్ జయంతి మహోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ స్వామికి అర్చనలు, హోమాలు జరిగాయి. వివిధ ఆలయాలను సుందరంగా అలంకరించారు.

–సాక్షి, ఒంగోలు



దొనకొండ: ఆనంద ఆశ్రమంలో ఆంజనేయస్వామి విగ్రహం వద్ద భక్తులు



పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో అర్చనకు లక్ష మల్లెలను సిద్ధం చేస్తున్న మహిళలు



ఐనముక్కలలో విశేష పూజలు అందుకున్న ప్రసన్నాంజనేయస్వామి



సింగరాయకొండ-ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



గొల్లగట్టులో తమలార్చనలో పాల్గొన్న భక్తులు



సీఎస్‌పురం: పూజల్లో పాల్గొన్న భక్తులు

సత్తాచాటిన గుంటూరు కోడెలు

రాచర్ల: మండలంలోని చోళ్లవీడులో వేమయ్యస్వామి ఆరాధన మహోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి నాలుగు పండ్ల సైజు ఎడ్ల బండలాగుడు పోటీల్లో గుంటూరు జిల్లా, పెద్దాకాకాని మండలం, పెద్దాకాకాని గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు ఎడ్ల జతలు సత్తాచాటాయి. ఈ ఎడ్ల పోటీల్లో మొత్తం 17 జతలు ఎద్దు పాల్గొనగా గుంటూరు జిల్లా, పెద్దాకాకాని మండలం, పెద్దాకాకాని గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు ఎడ్ల జతలు నిర్ణీత 15 నిమిషాల్లో 5400 అడుగులు లాగి మొదటి బహుమతిని సాధించాయి. అదేవిధంగా సత్యసాయి జిల్లా, సీకే పల్లి మండలం, పులేంకపల్లె గ్రామానికి చెందిన బచ్చల భాస్కర్‌రెడ్డి ఎద్దు 5277 అడుగులు లాగి రెండో బహుమతి సాధించగా, బాపట్ల జిల్లా, బల్లికురవ మండలం, గంగపాలెం గ్రామానికి చెందిన రాయి సుబ్బాయ్య ఎడ్ల జతలు 5100 అడుగులు లాగి మూడో బహుమతిని సాధించాయి. బేస్తవారిపేట మండలం, వంగపాడు గ్రామానికి చెందిన కైప వెంకటరామిరెడ్డి ఎడ్ల జతలు 5100 అడుగులు లాగి నాలుగో బహుమతి, అర్థవీడు మండలం, నారాయణపల్లె గ్రామానికి చెందిన జంగాల రంగ దివ్యశ్రీ ఎద్దు 4856 అడుగులు లాగి ఐదో బహుమతి పొందాయి. పల్నాడు జిల్లా, నూజేల్లా మండలం, రెడ్డిపాలెం గ్రామానికి చెందిన జక్కిరెడ్డి సుబ్బారెడ్డి ఎడ్ల జతలు 4800 అడుగులు లాగి ఆరో బహుమతి, కొమరోలు మండలం, పామూరుపల్లె గ్రామానికి చెందిన కామూరి రమణారెడ్డి, గోపు రమణారెడ్డిల ఎడ్ల జతలు 4551 అడుగులు లాగి ఏడో బహుమతి సాధించాయి. తెలంగాణ రాష్ట్రానికి చెందిన రక్షిరారెడ్డి ఎడ్ల జతలు 4301 అడుగులు లాగి ఏనిమిదో బహుమతిని సాధించాయి. గెలుపొందిన విజేతల యజమానులకు వరుసగా రూ. 40 వేలు, రూ. 30, రూ. 17,500, రూ. 17,500, రూ. 10, రూ. 8, రూ. 5, రూ. 4 వేలను ఎండ్ల యజమానులకు పంపిణీ చేశారు.



చోళ్లవీడులో బండలాగుతున్న ఎడ్ల జతలు

వడదెబ్బకు ఇద్దరు మృతి



మృతి చెందిన శ్రీనివాస రెడ్డి



వడదెబ్బకు మృతి చెందిన దేవరపల్లి దుర్గమ్మ

ఒంగోలు రూరల్: తీవ్ర వడగాడ్పులతో పాటు అధిక ఉష్ణోగ్రతల దెబ్బకు జిల్లాలో ఇద్దరు మృతి చెందారు. రూరల్‌లోని కరవదిలో అంబేడ్కర్ నగర్‌కు చెందిన దేవరపల్లి దుర్గమ్మ (64) వడదెబ్బకు గురై మృతి చెందినట్లు కుమారు మధుబాబు తెలిపారు. గత మూడు రోజులుగా 43 డిగ్రీల నుంచి శుక్రవారం 45 డిగ్రీలు నమోదవుతున్నాయి. ఈ క్రమంలో దుర్గమ్మకు తీవ్ర జ్వరంతో సొమ్మసిల్లి పడిపోవడంతో 108 లో శుక్రవారం ఒంగోలు ఆసుపత్రికి తరలించారు. ఆమె పరీక్షించిన వైద్యులు అప్పటికే జ్వరం 106 డిగ్రీలు ఉందని.. తీవ్ర వడదెబ్బకు గురైందని, కుమారుడు మధుబాబుకు తెలిపి అనంతరం చికిత్స ప్రారంభించారు. వైద్యుల ప్రయత్నం విఫలం కాగా శనివారం ఆమె మృతి చెందారు. ఈమెకు కుమారులు, కుమార్తెలున్నారు.

మార్కాపురం రూరల్: మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన కంది శ్రీనివాసరెడ్డి (47) వడదెబ్బతో మృతి చెందాడు. రాయవరానికి చెందిన శ్రీనివాసరెడ్డి మసాలా బండి ద్వారా జీవనంసాగిస్తున్నాడు. శుక్రవారం తీవ్రమైన ఎండతో వడదెబ్బకు గురికావడంతో కుటుంబ సభ్యులు ప్రాథమిక చికిత్స చేసి వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు.

క్వారీలో పడి మహిళ మృతి

తర్లుపాడు: ప్రమాదవశాత్తు పలకల క్వారీలో జారిపడి మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని బుడ్డపల్లి గ్రామ సమీపంలోని పలకల క్వారీలో శనివారం చోటుచేసుకుంది. మార్కాపురం మండలం గోగులదిన్నెకు చెందిన బూదాల వెంకటమ్మ (35) మండలంలోని బుడ్డపల్లి సమీపంలోని పలకల క్వారీలో పనికి వెళ్లింది. ఈ క్రమంలో కాలుజారి క్వారీలో పడి అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్సై వేముల సుధాకర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టపగలే చోరీ

పామూరు: పట్టపగలే ఇంట్లో చోరీ జరిగిన ఘటన మండలంలోని రావిగుంటపల్లె వద్దగల టోల్‌గేట్ సమీపంలో 565 జాతీయ రహదారి పక్కన నివాసంలో చోటు చేసుకుంది. పోలంరెడ్డి బాలమ్మ శనివారం ఉదయం పొలం పనులకు వెళ్లింది. తిరిగి వచ్చే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళం తీసి ఉంది.అందులోని రూ. 3.50 లక్షల నగదు,ఒకటిన్నరసవరబంగారుఆభరణా చోరీకి గురయినట్లు గుర్తించారు.

రెండో విడత 263 మంది విద్యార్థులకు అర్హత

ఒంగోలు: విద్యా హక్కు చట్టంలో భాగంగా ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచిత ప్రవేశాల కోసం 263 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ డి.సుభద్ర శనివారం తెలిపారు. బీసీ విద్యార్థులు 141మంది, మైనార్టీ విద్యార్థులు 38 మంది, ఓసీ సామాజిక వర్గాలకు చెందిన 58 మంది, ఎస్సీ 25, ఎస్టీ 1 విద్యార్థి అర్హత సాధించారు. వీరు వారు ఎన్నుకున్న పాఠశాలలో సంబంధిత పత్రాలతో చేరాలన్నారు. మండల స్థాయి అభ్యంతరాలు మండల విద్యాశాఖ అధికారి సమక్షంలో పరిష్కరిస్తామని, మండల విద్యాశాఖ అధికారుల ద్వారా వచ్చిన అభ్యంతరాలను డీఈఓ సమక్షంలో పరిష్కరిస్తామని చెప్పారు. అభ్యంతరాలను సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ (విజయవాడ) వారు పరిష్కరిస్తారని ఎస్ఎస్ఏ అదనపు పీడీ డి.సుభద్ర పేర్కొన్నారు.

బీరు సీసా దాడిలో గాయపడిన వ్యక్తి మృతి



అబుదావలి(ఫైల్)



అబుదావలి మృతదేహం

కురిచేడు: మండలంలోని బోధనంపాడు గ్రామంలో శుక్రవారం జరిగిన ఘర్షణలో గాయపడ్డ షేక్ అబుదావలి (47) మంగళగిరి ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శనివారం తుదిశ్వాస విడిచాడు. సరదాగా జిగ్గాట దగ్గర కూర్చుని.. ఆ తర్వాత జీవితమే లేకుండా చేసుకున్నాడు. జిగ్గాట వద్ద జరిగిన ఘర్షణలో అబుదావలిని అదే గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త వేమా గోవింద రమేష్ బీరు బాటిల్‌తో తలపై చెవి దగ్గర గట్టిగా కొట్టడంతో తలలో నరాలు చిట్లిపోయాయని వైద్యులు పేర్కొన్నారు. అంతటితో ఆగని గోవింద రమేష్ అబుదావలిని కిందపడేసి గొంతుపై, గుండెలపై కాలితో తొక్కిన విషయం పాఠకులకు విదితమే. క్షతగాత్రుడ్ని దర్శి ప్రభుత్వ వైదశాలకు తరలించగా అక్కడ పరీక్షించిన వైద్యులు ఒంగోలు కిమ్స్‌కు మెరుగైన వైద్యం కోసం తరలించారు. అక్కడ కూడా పరిస్థితి అదుపులోకి రాకపోవటంతో శుక్రవారం రాత్రి జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. బీరు సీసా దెబ్బ జీవితాన్ని బ్రేక్ చేసింది. ఒక కుటుంబాన్ని రోడ్డున పడేసింది. పెద్దదిక్కు కోల్పోయేలా చేసింది. మృతునికి భార్య, ఇరువురు సంతానం ఉన్నారు. అబుదావలి 108 లో పైలట్‌గా విధులు నిర్వహిస్తూ అందరి మంచిగా మెసలుకునేవాడని సహచర పైలట్లు పేర్కొన్నారు. అబుదావలి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.